# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-08-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

2. **ప్రతి చేనేత కార్మికునికి 'నేతన్నల సేవలో" పథకం అందజేస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు.**

3. **తెలంగాణ రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన పలువురు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.**

4. **రాష్ట్రంలో లోటు వర్షపాతం నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి కోరారు.**

==========================

వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ నెల 31వ తేదీన వెలిగొండ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జలహారతి ఇవ్వనున్న నేపథ్యంలో ఏర్పాట్లను గత రాత్రి మంత్రి పరిశీలించారు. ఫీడర్ కెనాల్‌లో రెగ్యులేటర్ గేట్ల పనులను పరిశీలించి, ఘాట్, స్థూపం, సభా వేదిక ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. వెలిగొండ ప్రాజెక్టుల కోసం సుమారు 7 వేల కుటుంబాలు చేసిన త్యాగం ఫలితంగా లక్షల ఎకరాలకు సాగునీరు, లక్షలాది ప్రజలకు తాగునీరు అందనున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు పాత్రికేయులకు తెలియజేస్తూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ప్రతి చేనేత కార్మికునికి 'నేతన్నల సేవలో' పథకం అందజేస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుగొండలో పాత్రికేయుల సమావేశం ఈరోజు నిర్వహించారు. మొదటి విడతలో 71 వేల 536 మందికి 25 వేల రూపాయల ఆర్థిక సాయం అందించామని తెలిపారు. రెండో విడతగా త్వరలోనే అర్హులకు ఆర్థికసాయం అందిస్తామని చెప్పారు. కొత్తగా 36 వేల 6 వందల 17 దరఖాస్తులు

వచ్చినట్లు వివరించారు. ఈ నెలాఖరు వరకూ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను గుర్తించి … వారి ఖాతాల్లో నిధులను జమ చేయనున్నట్లు తెలిపారు.

---

గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలోని కోటుపరువు పంచాయతీ పరిధిలో గిరిజన ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో 52 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో రహదారి సౌకర్యం అత్యంత కీలకమని తెలిపారు. రోడ్లు అందుబాటులోకి వస్తే విద్య, వైద్యం, ఉపాధి, మార్కెట్ సౌకర్యాలు ప్రజలకు మరింత చేరువవుతాయని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు.

---

అడవిపై ఆధారపడి జీవించే గిరిజన కుటుంబాల ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో అటవీ సంపదను ఆదాయ వనరుగా మలుస్తూ వంధన్ వికాస్ కేంద్రాలు గిరిజన కుటుంబాల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయి. అడవుల నుంచి సేకరించే తేనె, చింతపండు, కొండ చిప్పలు, ఉసిరి, కరక్కాయ, ఇప్పపువ్వు వంటి అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి. గిరిజన మహిళా సంఘాలు, యువతను సమీకరించి ఉత్పత్తుల శుభ్రత, ప్యాకింగ్, నిల్వ, మార్కెటింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. జీవనోపాధి మెరుగుపడటంతో పాటు అటవీ సంపద సంరక్షణకు కూడా ఇవి దోహదపడుతున్నాయని మక్కువ మండలం వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ జయకుమార్ పేర్కొంటూ..

వాయిస్…27 సెకన్లు

---

తెలంగాణలోని సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట శివారులో ఈరోజు రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న బస్సు.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా, వారిలో ముగ్గురు ఉమ్మడి కృష్ణాజిల్లాకి చెందిన వారు కాగా, మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయని వివరించారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, తెలంగాణ రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకోవాలని సంబంధిత అధికారులకు వారు సూచించారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం పట్ల రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రయాణికుల భద్రతే అత్యంత ప్రాధాన్యతగా అన్ని బస్సుల యాజమాన్యం, డ్రైవర్లు వ్యవహరించాలని మంత్రి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

---

రాష్ట్రంలో లోటు వర్షపాతం, కరవు పరిస్థితుల నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో పాత్రికేయుల సమావేశం ఈరోజు నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. జూన్ నుంచి ఇప్పటివరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని, రాష్ట్రంలోని 688 మండలాలకు గాను 625 మండలాల్లో లోటు వర్షపాతం ఉన్నట్లు చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉందని తెలిసినప్పటికీ, రైతులు సాగు కొనసాగించారని, ప్రస్తుతం పంటల పరిస్థితిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొంటూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆధ్వర్యంలో ఏలూరులోని అశోక్ నగర్‌లో ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.జితేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 750 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18 సంవత్సరాలు నుంచి 35 సంవత్సరాల వయసు గలవారు అర్హులని వివరించారు. ఈ ఉద్యోగ మేళాకు హాజరు అయ్యే అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత పత్రాలు నకలతో హాజరు కావాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 137వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 28వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జలజీవన్ మిషన్ కింద చేపడుతున్న, భవిష్యత్తులో చేపట్టనున్న తాగునీటి సరఫరా పథకాలకు ‘జేజేఎం-అమరజీవి జలధార’ పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఆవిర్భావం కోసం అసమాన త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారకంగా తాగునీటి సరఫరా పథకాలకు ఆయన పేరును ఖరారు చేసినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

=====================